# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం - 12- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 69 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


## నిషేధిత భూములపై ఆందోళన అవసరం లేదు

**అర్హులందరికీ న్యాయం చేస్తాం: పొంగులేటి**

**ఈనెల 14లోగా పత్రాలన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్**

**ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ లేదని స్పష్టం**

హైదరాబాద్, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు): నిషేధిత ఆస్తుల పీఓబీ, 22ఏ జాబితాల్లో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు, ఆందోళనలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని, గతంలో ఏర్పడిన సాంకేతిక, చట్టపరమైన సమస్యలను పరిష్కరించి బాధితులకు ఊరట కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. కొత్తగా ఎలాంటి భూములను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వ కాలం నుంచి కొనసాగుతున్న సమస్యలను పారదర్శకంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. భూముల క్రమబద్ధీకరణకు



సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వం జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రక్రియలు, లేఅవుట్

మిగతా 2లో

## పాతబస్తీ మెట్రో పనులు వేగవంతం చేయాలి



**ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట కారిడార్‌పై సీఎం సమీక్ష**

**భూ సేకరణ, టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఆదేశం**

**మెట్రోలో అదనపు కోచ్‌ల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్**

హైదరాబాద్, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్ మెట్రో విస్తరణ రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో రైలు ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌పై ఉన్నతాధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర ప్రతిపాదించిన మెట్రో కారిడార్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు.

పెండింగ్‌లో ఉన్న భూసేకరణ అంశాలను ప్రత్యేకంగా పర్యవేక్షించి త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రాజెక్టు అమలులో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా చూడాలని సూచించారు. హైదరాబాద్ మెట్రోలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు కోచ్‌లను జత చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

మిగతా 2లో



## కర్రెగుట్టల అభివృద్ధిపై డీజీపీ ప్రత్యేక దృష్టి

**కర్రెగుట్టల్లో విస్తృత పర్యటన**

**రహదారి పనుల పురోగతిపై సమీక్ష**

**గిరిజన కుటుంబాలతో ముఖాముఖి**

**అభివృద్ధి–శాంతి భద్రతలపై సూచనలు**

2లో

## యంగ్ ఇండియా పాఠశాలలతో పేదల కలలకు రెక్కలు

- ప్రపంచ స్థాయి విద్యే ప్రభుత్వ లక్ష్యం
- ప్రతి నియోజకవర్గంలో ఆధునిక విద్యా సంస్థలు
- సామాజిక అసమానతలకు ముగింపు పలకడమే ధ్యేయం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు): భవనాలు నిర్మించడం సులభమే కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

మిగతా 2లో






## పత్తి కొనుగోళ్లపై తుమ్మల కీలక ఆదేశాలు

- 15–30 రోజుల్లో అన్ని జిల్లాల్లో జిన్నింగ్ మిల్లుల ప్రారంభం
- పత్తి కొనుగోళ్లలో మధ్యవర్తులకు అవకాశం లేదన్న మంత్రి
- స్లాట్ బుకింగ్ విధానం సరళీకరణకు ఆదేశాలు
- రైతుల ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్, వాట్సాప్ సేవలు

హైదరాబాద్, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలో రానున్న 202627 పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పత్తి కొనుగోళ్లను సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో సీసీఐ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కొనుగోలు ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. రైతులకు మార్కెటింగ్ దశలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి ప్రతి రైతుకు కనీస మద్దతు ధర ప్రయోజనం అందేలా చూడాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, 25.85 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. లాంగ్ స్టేపుల్ కాటన్‌కు కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.8,667 మద్దతు ధర ప్రకటించిందని, గత ఏడాదితో పోలిస్తే రూ.557 పెరిగిందని వెల్లడించారు.

పత్తి కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యానికి తావు లేకుండా రైతుల నుంచే నేరుగా కొనుగోళ్లు జరగాలని మంత్రి ఆదేశించారు. గత సీజన్లలో గుర్తించిన లోపాలను పరిగణనలోకి తీసుకుని ఈసారి అవకతవకలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసి, అవసరానికి అనుగుణంగా అన్ని కేటగిరీల మిల్లులను ఒకేసారి ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. గత సీజన్‌లో 122 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఈసారి వాటి సంఖ్యను 131కు పెంచినట్లు మంత్రి తెలిపారు. పత్తి రాక అధికంగా ఉండే ప్రాంతాల్లో అదనపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

మిగతా 2లో

## చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

**అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పుల్లేవు**

**పలు వర్గాలకు కొత్త పింఛన్ల మంజూరు**

**పారదర్శకంగా అర్హుల ఎంపిక ప్రక్రియ**

హైదరాబాద్, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు): అర్హులైన పేదలు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేయూత సామాజిక భద్రత పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు చర్యలు చేపట్టింది. తొలి దశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న అర్హులకు కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. కొత్త పింఛన్ల కోసం అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పులు చేయలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత ప్రభుత్వాల హయాంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న నిబంధనలనే ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. 2014 నుంచి 2018 మధ్య జారీ చేసిన సంబంధిత ఉత్తర్వుల ప్రకారమే అర్హతలను పరిశీలించి పింఛన్ల మంజూరు ప్రక్రియ చేపట్టనున్నారు.

మిగతా 2లో

## టెసరాక్ట్ కథేంటో తేల్చాలని కేటీఆర్ డిమాండ్



- టెసరాక్ట్ భూకేటాయింపులపై బీఆర్‌ఎస్ తీవ్ర ఆరోపణలు
- రూ.200 కోట్ల విలువైన భూమిని షెల్ కంపెనీకి కట్టబెట్టారన్న కేటీఆర్
- ముఖ్యమంత్రి సోదరుడికి కంపెనీతో సంబంధాలున్నాయని ఆరోపణ
- భూకేటాయింపుల వ్యవహారంపై పూర్తి విచారణకు డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు): టెసరాక్ట్ అనే సంస్థకు తెలంగాణ ప్రభుత్వం భూమి కేటాయించిన వ్యవహారంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి చైర్మన్‌గా ఉన్న

మిగతా 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# కర్రెగుట్టల అభివృద్ధిపై డీజీపీ ప్రత్యేక దృష్టి

**ములుగు, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు):**

ములుగు జిల్లా కర్రెగుట్టల ప్రాంతంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కతో స్వాగతం పలికారు. అనంతరం పామునూరులోని 39 సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపుకు చేరుకున్న డీజీపీకి పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. పర్యటనలో భాగంగా కర్రెగుట్టల ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను డీజీపీ పరిశీలించారు. పామునూరు, చెలిమల, డోలి, తడపాల గ్రామాల మీదుగా నిర్మించిన సుమారు 28 కిలోమీటర్ల రహదారి పనుల పురోగతిని స్వయంగా పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ రహదారి పూర్తయితే గిరిజన ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని అధికారులు వివరించారు.

రహదారి మార్గంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీజీపీ జాతీయ పతాకాన్ని ఎగురవేసి శాంతికి ప్రతీకగా పావురాలను గాల్లోకి వదిలారు. అనంతరం పనుల నాణ్యత, నిర్మాణ ప్రమాణాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా పూర్తయ్యేలా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పామునూరులో నివసిస్తున్న గుత్తికోయ గిరిజన కుటుంబాలను కూడా డీజీపీ కలుసుకున్నారు. వారి జీవన పరిస్థితులు, ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారికి బియ్యం, దుప్పట్లు పంపిణీ చేసి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని డీజీపీ పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతాయని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. డీజీపీ పర్యటనతో కర్రెగుట్టల ప్రాంత అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతం లభించనుంది. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, ప్రజా సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలు వేగవంతం కానున్నాయని అధికారులు వెల్లడించారు. పర్యటనలో వివిధ శాఖల అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నిషేధిత భూములపై ఆందోళన అవసరం లేదు

(మొదటి పేజీ తరువాయి)



అనుమతులు తదితర అన్ని పత్రాలను ఈనెల 14వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ ప్రక్రియ ద్వారా నకిలీ పత్రాలకు అడ్డుకట్ట పడటంతో పాటు అసలైన పత్రాలను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని చెప్పారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఏది నిజమైన పత్రం, ఏది బోగస్ పత్రం అన్న విషయాన్ని అధికారులు సులభంగా నిర్ధారించగలరని తెలిపారు. మరింత పారదర్శకత కోసం పహానీ వివరాలను కూడా సబ్ రిజిస్ట్రార్లకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

వచ్చిన దరఖాస్తుల్లో నిజమైనవాటిని గుర్తించి యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. ఈ విషయంలో కలెక్టర్లు మరింత చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. సమస్యలు వచ్చిన తర్వాత పరిష్కరించడం కంటే ముందుగానే వాటిని నివారించడం జిల్లా యంత్రాంగం బాధ్యత అని పేర్కొన్నారు. పీఓబీ, 22ఏ అంశాలకు సంబంధించిన ప్రతి దరఖాస్తును ప్రతిరోజూ సమీక్షిస్తూ త్వరితగతిన పరిష్కార మార్గాలు అన్వేషించాలని ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, జిల్లా సబ్ రిజిస్ట్రార్లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రజావాణి, కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లకు వచ్చిన దరఖాస్తుల సంఖ్య, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చాలని అధికారులకు సూచించారు. సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని, ఆన్‌లైన్‌లో నమోదైన వివరాల మేరకే నిర్ణయాలు తీసుకునేలా వారి అధికారాలను పరిమితం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. పీఓబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌లను గుడ్డిగా తిరస్కరించకుండా, అవసరమైతే మూడు రోజుల గడువు తీసుకుని తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. ఏదైనా సందేహం లేదా సమస్య ఉంటే జిల్లా కలెక్టర్ లేదా రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పీఓబీకి సంబంధించిన ప్రతి దరఖాస్తును ఇకపై తహసీల్దార్‌కు కాకుండా నేరుగా కలెక్టర్‌కు పంపించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ భూముల విషయంలో నిర్లక్ష్యం లేదా అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గతంలో వ్యవసాయ, వ్యవసాయేతర, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండగా ప్రస్తుతం సమీకరణ కారణంగా కొన్ని ఆస్తుల విషయంలో గందరగోళం ఏర్పడుతోందని చెప్పారు. తాజా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచిన తర్వాత అదే ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంత్, సంబంధిత జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

# పాతబస్తీ మెట్రో పనులు వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)



ఇందుకోసం అవసరమైన కోచ్‌ల కొనుగోలు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు.

మెట్రో ఫేజ్ 2లో భాగంగా చేపట్టనున్న పాతబస్తీ కారిడార్ నిర్మాణానికి సంబంధించి తాజా సాంకేతిక పరిజ్ఞానం, నిర్మాణ విధానాలపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదింపులు జరపాలని సూచించారు. అవసరమైన సాంకేతిక సలహాలు తీసుకుని ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాతబస్తీ మెట్రో ప్రాజెక్టు పూర్తయితే నగర రవాణా వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

# యంగ్ ఇండియా పాఠశాలలతో పేదల కలలకు రెక్కలు

(మొదటి పేజీ తరువాయి)




ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో బాలురు, బాలికల కోసం ఈ విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని గతంలోనే స్పష్టం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ప్రపంచ స్థాయి విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి తెలిపారు. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే భేదాలకు అతీతంగా ప్రతి చిన్నారికి సమాన అవకాశాలు కల్పించేందుకు ఈ విద్యాసంస్థలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కూడా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని ఆయన వివరించారు.

ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక సౌకర్యాలతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం జరుగుతోందని సీఎం తెలిపారు. ఈ విద్యాలయాలు కేవలం పాఠశాలలు మాత్రమే కాకుండా భవిష్యత్ శాస్త్రవేత్తలు, పరిపాలకులు, పారిశ్రామికవేత్తలు, దేశ నిర్మాతలను తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యారంగంలో సమూల మార్పులకు ఇవి కేంద్ర బిందువుగా మారనున్నాయని అభిప్రాయపడ్డారు. యంగ్ ఇండియా విద్యా సంస్థల ద్వారా సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం వెల్లడించారు. పేద విద్యార్థులు కూడా అత్యున్నత విద్యా ప్రమాణాలను అందుకునేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్ రెడ్డి తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యా విధానంలో మార్పులు తీసుకువస్తూ, విద్యార్థులు ఉద్యోగాలకు సిద్ధమయ్యేలా పాఠ్యాంశాలు, బోధనా విధానాలను రూపొందిస్తున్నట్లు వివరించారు. యంగ్ ఇండియా విద్యా వ్యవస్థ ద్వారా భవిష్యత్ తరాలకు బలమైన పునాది వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. పేద పిల్లల కలలకు చిరునామాగా, తెలంగాణ అభివృద్ధి నమూనాకు ప్రతీకగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిలవబోతున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ విద్యా సంస్థలు తరతరాల భవిష్యత్తును మార్చే శక్తిగా మారనున్నాయని, సమాన అవకాశాలతో కూడిన సమాజ నిర్మాణానికి ఇవి దోహదపడతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# టెసరాక్ట్ కథేంటో తేల్చాలని కేటీఆర్ డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)



కంపెనీకి రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కేటాయించారని ఆరోపిస్తూ ఈ వ్యవహారాన్ని పెద్ద కుంభకోణంగా అభివర్ణించారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టెసరాక్ట్ సంస్థకు ఐదెకరాల భూమిని తక్కువ ధరకు కేటాయించారని కేటీఆర్ ఆరోపించారు. ఆ సంస్థకు కొండల్ రెడ్డి చైర్మన్‌గా ఉన్నట్లు లింక్డ్ఇన్ ప్రొఫైల్, అమెరికా కాన్సులేట్ ప్రకటనల్లో ప్రస్తావించారని పేర్కొన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగ పరికరాల తయారీ పేరుతో సంస్థ పనిచేస్తోందని చెప్పుకుంటున్నప్పటికీ, కంపెనీ కార్యకలాపాలపై అనేక అనుమానాలు ఉన్నాయని అన్నారు. కంపెనీలో ఉద్యోగులు లేరని, మూలధనం కేవలం లక్ష రూపాయలేనని, సంస్థ చిరునామా, ఫోన్ నంబర్ వంటి వివరాల్లోనూ అనేక సందేహాలు ఉన్నాయని కేటీఆర్ ఆరోపించారు. ఇలాంటి సంస్థకు భారీ విలువైన ప్రభుత్వ భూమి కేటాయించడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు సంబంధించిన ఇతర వ్యాపార లావాదేవీలు, ఒప్పందాలపై కూడా బీఆర్ఎస్ ప్రశ్నలు లేవనెత్తింది. అమెరికా పర్యటనల సమయంలో జరిగిన పెట్టుబడి ఒప్పందాలు, కాంట్రాక్టుల కేటాయింపులు, ప్రభుత్వ ప్రాజెక్టుల అమలులో కుటుంబ సభ్యుల పాత్రపై సమగ్ర దర్యాప్తు జరగాలని కోరింది. ఈ వ్యవహారంపై పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చేసిన వ్యాఖ్యలను కూడా కేటీఆర్ తప్పుబట్టారు. టెసరాక్ట్ సంస్థకు ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతో ఎలాంటి సంబంధం లేదన్న ప్రభుత్వ వాదన వాస్తవాలకు విరుద్ధమని ఆరోపించారు. భూకేటాయింపుల ప్రక్రియలో పారదర్శకత పాటించలేదని విమర్శించారు. అయితే ఇవి బీఆర్ఎస్ చేసిన రాజకీయ ఆరోపణలు మాత్రమే. ఈ ఆరోపణలపై ప్రభుత్వం లేదా సంబంధిత సంస్థల నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. భూకేటాయింపుల వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే స్వతంత్ర విచారణ జరగాలని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.




# పత్తి కొనుగోళ్లపై తుమ్మల కీలక ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఒక ప్రాంతంలో మిల్లు అందుబాటులో లేకపోతే సమీపంలోని నోటిఫైడ్ మిల్లుకు అనుసంధానం చేసి రైతులకు ప్రయాణ భారం తగ్గించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో పనిచేసే మానిటరింగ్ కమిటీల్లో రైతుల ప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకృతం చేయాలని మంత్రి ఆదేశించారు. స్లాట్లు ప్రారంభించే ముందు రైతులకు విస్తృత ప్రచారం కల్పించాలని, అవసరమైతే ఒకే మొబైల్ నంబర్‌కు బహుళ బార్‌కోడ్ సౌకర్యం కల్పించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. రాష్ట్ర సగటు దిగుబడిని ప్రకటించి, అధిక దిగుబడి సాధించిన రైతులకు డిజిటల్ యీల్డ్ సర్టిఫికెట్లు జారీ చేయాలని చెప్పారు. పత్తి అధికంగా పండే జిల్లాల్లో కాటన్ టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. రైతుల ఫిర్యాదుల పరిష్కారం కోసం 1800 599 5779 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్, 88972 81111 వాట్సాప్ చాట్‌బాట్ సేవలను విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి పేర్కొన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాలు, నాణ్యత పరీక్ష పరికరాలు, బరువు కొలిచే యంత్రాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని ఆదేశించారు. పత్తి కొనుగోళ్లలో రైతులకు నష్టం కలిగించే చర్యలు లేదా అవకతవకలు చోటుచేసుకుంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, ప్రతి రైతుకు మద్దతు ధర అందేలా అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాపాలన వారోత్సవాలు, 99 రోజుల ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, ప్రజావాణి కార్యక్రమాల్లో ఇప్పటికే అందిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. గతంలో దరఖాస్తు చేసి అవసరమైన పత్రాలు సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. అయితే ఇప్పటివరకు దరఖాస్తు చేయని వారు లేదా అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించని అర్హులు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హత నిర్ధారణ కోసం సంబంధిత శాఖల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను సేకరించే బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. వితంతువులకు భర్త మరణ ధ్రువపత్రం, ఒంటరి మహిళలకు సెపరేషన్ లేదా స్థానిక విచారణ నివేదిక, గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ, చేనేత కార్మికులకు చేనేత-జౌళి శాఖ ధ్రువీకరణ, ఫైలేరియా బాధితులకు వైద్య ఆరోగ్య శాఖ ధ్రువీకరణ తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

దరఖాస్తుల పరిశీలన అనంతరం నిర్దేశిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అర్హతను నిర్ధారించనున్నారు. అనంతరం అర్హుల జాబితాను జిల్లా స్థాయికి పంపించి జిల్లా కలెక్టర్ ఆమోదంతో పింఛన్ల మంజూరు ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ప్రతి అర్హుడికి చేయూత అందించాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల సమాఖ్యలను కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేశారు. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను ఆగస్టు 31, 2026 వరకు స్వీకరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దరఖాస్తుల వివరాలను చేయూత పోర్టల్‌లో నమోదు చేసి వేగంగా పరిశీలించనున్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# విద్యార్థిపై దాడి ఘటనపై బాలల హక్కుల కమిషన్ సీరియస్



- శ్రీ చైతన్య పాఠశాల భద్రతా లోపాలపై ఆరా.. సీసీ కెమెరాలు లేకపోవడంపై ఆగ్రహం

**దమ్మాయిగూడ, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా దమ్మాయిగూడలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థిపై తోటి విద్యార్థులు దాడి చేసిన ఘటనపై తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రంగా స్పందించింది. విద్యార్థుల భద్రత విషయంలో పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందా? భద్రతా నిబంధనలు ఎందుకు పాటించలేదు? అనే అంశాలపై కమిషన్ ఆరా తీసింది. ఈ ఘటనపై తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత సంబంధిత అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. అలాగే జవహర్‌నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సైదులుతో మాట్లాడి ఘటనకు సంబంధించిన పరిస్థితులు, ఇప్పటివరకు పోలీసులు తీసుకున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్న శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల భద్రత కోసం తగిన స్థాయిలో సీసీ కెమెరాల వ్యవస్థ లేకపోవడంపై కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్న విద్యాసంస్థలో భద్రతా ఏర్పాట్ల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేసింది.

విద్యార్థులపై దాడులు, వేధింపులు లేదా ఇతర అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నప్పుడు వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడంలో, బాధ్యులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని కమిషన్ పేర్కొంది. ఈ నేపథ్యంలో పాఠశాలలో విద్యార్థుల భద్రతకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని సూచించింది.

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డీఈవో తక్షణమే ఈ వ్యవహారంపై దృష్టి సారించి, దమ్మాయిగూడ శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల భద్రతా ప్రమాణాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, పాఠశాల యాజమాన్యం అనుసరిస్తున్న నిబంధనలు తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కమిషన్ కోరింది.విచారణలో పాఠశాల యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించింది.

విద్యార్థుల భద్రత విషయంలో పాఠశాల యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదనే స్పష్టమైన సందేశాన్ని ఈ ఘటన ద్వారా బాలల హక్కుల కమిషన్ ఇచ్చినట్లయింది.

# మామిళ్లగూడెం నుంచి ఐసీఐసీఐ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్‌గా అర్వపల్లి అఖిల నాగ రమ్య



- చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుతూ.. ఉన్నత స్థాయికి ఎదిగిన యువతి
- పిల్లలు పుట్టినప్పుడు కాదు వారు భవిష్యత్తులో అభివృద్ధిలోకి వచ్చినప్పుడే నిజమైన ఆనందం అని నిరూపించిన అర్వపల్లి నగేష్-శ్రీలక్ష్మి

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 11(తెలంగాణ ముచ్చట్లు):** మామిళ్లగూడెం లో నివాసం ఉండే మధ్యతరగతి కుటుంబానికి చెందిన అర్వపల్లి నగేష్ ల కుమార్తె అఖిల నాగరమ్య, చిన్ననాటి నుండే చదువులో ముందుండి,ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పట్టుదలతో, ఉన్నత చదువులు చదివి నేడు దేశంలోనే ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించే స్థాయికి ఎదిగారు. కష్టపడి చదివి, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆమె విద్యా ప్రస్థానం నిరూపిస్తోంది.

ఎన్ని కష్టాలు ఎదురైనా తన కుమార్తె భవిష్యత్తు బాగుండాలని, ఆర్థికంగా ఎన్నో సమస్యలు తలెత్తిన, కుమార్తెను వెన్ను తట్టి ప్రోత్సహించడంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించారు తద్వారా అఖిల నాగ రమ్య 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మామిళ్లగూడెంలోని మాంటిస్సోరి ప్రైవేట్ స్కూల్‌లో విద్యనభ్యసించారు. అనంతరం ఇంటర్ విద్యను సాహితి జూనియర్ కాలేజీలో పూర్తిచేశారు. ఉన్నత విద్యలో భాగంగా గుంటూరులోని మాస్టర్ మైండ్స్ కాలేజీలో తన చదువును కొనసాగించారు. విద్యార్థి దశ నుంచే పట్టుదల, క్రమశిక్షణతో చదువుతూ తన లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేసిన అఖిల నాగ రమ్య, తాజాగా ఐసీఐసీఐ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించటం, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, ఆమెను చదివించిన ఉపాధ్యాయుల్లో ఆనందాన్ని నింపింది.

"విద్యకు కృషి తోడైతే విజయానికి హద్దులు ఉండవు" అన్నట్లుగా అఖిల నాగ రమ్య సాధించిన ఈ విజయాన్ని పలువురు అభినందిస్తున్నారు. ఆమె మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, తల్లిదండ్రులకు, చదివిన పాఠశాల-కళాశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు.

తల్లిదండ్రుల ఆనందం

కూతురు చిన్ననాటి నుంచి కష్టపడి చదువుకుని ఉన్నత ఉద్యోగాన్ని సాధించడం పట్ల తల్లిదండ్రులు నగేష్, శ్రీలక్ష్మి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అఖిల నాగ రమ్య భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

మామిళ్లగూడెం నుంచి ప్రారంభమైన అఖిల నాగ రమ్య విద్యా ప్రయాణం.. ఐసీఐసీఐ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ స్థాయికి చేరుకోవడం నేటి యువతకు స్ఫూర్తిదాయకం.

# వందే భారత్ అవార్డుకు జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ ఎంపిక..

- సంచలనాత్మక కథనాలకు కేరాఫ్..
- నాడు డాక్టరేట్,నంది అవార్డు.. నేడు వందే భారత్ అవార్డు..
- వెల్లువెత్తుతున్న అభినందనలు..
- ప్రస్తుతం పీపుల్స్ డైరీ ఖమ్మం ప్రతినిధిగా విధులు

**ఖమ్మం బ్యూరో , ఆగష్టు 11(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ వందే భారత్ జాతీయ అవార్డుకి ఎంపికయ్యారు.. సీనియర్ జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ గత 13 సంవత్సరాలుగా వివిధ ఛానెల్స్, పత్రికల్లో, వివిధ హోదాల్లో జర్నలిస్ట్‌గా పనిచేస్తున్నారు. అనేక అంశాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, అదేవిధంగా ప్రజా సమస్యలను వెలికి తీస్తూ ప్రభుత్వాల ద్వారా వాటిని పరిష్కరించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. ఈ విధంగా సమాజానికి సేవచేస్తూ సీనియర్ జర్నలిస్ట్ గా పనిచేస్తున్నందుకు అతని సేవలను గుర్తించి ఈ నెల ఆగష్టు 15వ తేదీన శనివారం రోజున హైదరాబాద్ రవీంద్ర భారతి లోని పైడి జయరాజు ప్రివ్యూ థియేటర్ 2వ అంతస్థు లో జరిగే వందే భారత్ అవార్డు పురస్కారం కార్యక్రమంలో ప్రముఖ సినీ గీత రచయిత జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు చేతుల మీదుగా ప్రధానం చేస్తున్నారు. సీనియర్ జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ "పీపుల్స్ డైరీ" దినపత్రిక ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనేక సంచలనాత్మక కథనాలను అందించారు. ఎక్కడ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నా ఎలాంటి శక్తుల ఒత్తిళ్లకు లొంగకుండా నిర్భయంగా వార్తలు అందించడంలో దిట్ట... జర్నలిజం వృత్తినే శ్వాసగా... నైతిక విలువలను పాటిస్తూ పేదల పక్షాన నిలువడం, అన్యాయాన్ని ఎదురించడం లక్షణం.. అక్రమార్కుల బెదిరింపులకు వెరువకుండా, అక్రమ కేసులకు సైతం భయపడకుండా ఎంచుకున్న దారిలో దూసుకెళ్తూ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఎందరో జర్నలిస్టులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. వందే భారత్ జాతీయ అవార్డు రావడం పట్ల స్థానిక సీనియర్ జర్నలిస్టులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలుపుతూ సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు.



# చైతన్య యాత్ర ముగింపు సభను జయప్రదం చేయండి

- నగరంలో మూడు ప్రాంతాల నుంచి ప్రదర్శనలు
- భక్తరామదాసు కళాక్షేత్రంలో సభ
- హాజరుకానున్న కూనంనేని, బాగం




**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 11(తెలంగాణ ముచ్చట్లు):** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి పిలుపులో భాగంగా జిల్లాలో జరిగిన ప్రజా చైతన్య యాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 13న ఖమ్మంలో ముగింపు సభ జరుగుతుందని సిపిఐ నగర కార్యదర్శి ఎస్కె జానిమియా తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో మూడు ప్రాంతాల నుంచి భారీ ప్రదర్శనలు నిర్వహించనున్నామన్నారు. మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో పగడాల మల్లేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జానిమియా మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ, మార్పును కాంక్షిస్తూ 20 మండలాల్లో చైతన్య యాత్రను నిర్వహించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా "ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించడం జరిగిందని జానిమియా తెలిపారు. ముగింపు సందర్భంగా ఖమ్మం రోటరీ నగర్, అల్లిపురం క్రాస్ రోడ్డు, నయాబజార్ కళాశాల నుండి ప్రదర్శనలు ప్రారంభమవుతాయన్నారు. రోటరీ నగర్ నుండి ప్రారంభమయ్యే ప్రదర్శన మమత రోడ్డు, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా జెడ్పి సెంటర్కు చేరుకుంటుందని, అల్లిపురం క్రాస్ రోడ్డు నుంచి ప్రారంభమయ్యే ప్రదర్శన ముస్తఫానగర్ మీదుగా జెడ్పి సెంటర్కు చేరుకుంటుందని, నయాబజార్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన త్రీటౌన్ మీదుగా జెడ్పి సెంటర్కు చేరుకుంటుందని అక్కడి నుంచి మహా ప్రదర్శనగా భక్తరామదాసు కళాక్షేత్రంకు చేరుకుంటుందని జానిమియా తెలిపారు. అక్కడ సభ జరుగుతుందని తెలిపారు.

సభకు హాజరు కానున్న కూనంనేని :భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి తదితరులు పాల్గొంటారని జానిమియా తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, నాయకులు వరదా నర్సింహారావు, సైదా, యాకూబ్, దుర్గానాథ్ పాల్గొన్నారు.

# నీళ్లు ఉన్నాయని వరి వేస్తే ఇబ్బందులే!

- ఎల్‌నినో ప్రభావంతో వర్షా లు తగ్గే అవకాశం
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**పెద్దమందడి,ఆగస్టు11 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రస్తుతానికి నీళ్లు అందుబాటులో ఉన్నాయని తొందరపడి వరి సాగు చేసి, రానున్న రోజుల్లో ఇబ్బందులు పడొద్దని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి రైతులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని, రాబోయే రెండు నెలల్లో వర్షాలు తగ్గే ప్రమాదం ఉన్నందున రైతులు ముందుచూపుతో ఆరుతడి పంటలు, పామాయిల్, కూరగాయలు సాగు చేసుకోవాలని కోరారు. పెద్దమందడి రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. గత ఏడాది ఆగస్టు నాటికి మండలంలో 100 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదుకాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 76 సెంటీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైందన్నారు. గత ఏడాది 22 వేల ఎకరాల్లో పంటలు సాగు చేయగా, 18 వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది వరికి అవసరమైన స్థాయిలో నీరు అందే అవకాశం లేదని, భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయని చెప్పారు.రైతులు వేరుసెనగ, మినుములు, కూరగాయలు వంటి ఆరుతడి పంటలతో పాటు పామాయిల్ సాగు చేపట్టాలని సూచించారు. ఆరుతడి పంటలకు నాణ్యమైన, లాభదాయకమైన విత్తనాలు అందించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు.జిల్లా ఉద్యానవన శాఖ అధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ పామాయిల్ సాగును ప్రభుత్వం సబ్సిడీతో ప్రోత్సహిస్తోందన్నారు. ఒక ఎకరం వరికి వినియోగించే నీటితో మూడు ఎకరాల పామాయిల్ సాగు చేయవచ్చని తెలిపారు. ఎకరానికి 5 నుంచి 7 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. కూరగాయల సాగుకు ఎకరానికి రూ.9,600 సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు.రైతు వెంకటరెడ్డి మాట్లాడుతూ.. వరికి మద్దతు ధరతో పాటు బోనస్ అందుతున్నందున రైతులు ఇతర పంటల వైపు ఎందుకు వెళ్తారని ప్రశ్నించారు. ఆరుతడి పంటలకు నాణ్యమైన విత్తనాలతో పాటు బోనస్ అందించాలని కోరారు.కార్యక్రమంలో తహసిల్దార్ మల్లికార్జున్, ఎంపీడీఓ పర్ణిత, సింగిల్ విండో చైర్మన్ సత్యారెడ్డి, మండల వ్యవసాయ అధికారి సైదులు, సర్పంచ్ సూర్యగంగమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వరి పంటకే మద్దతు ధర, బోనస్ ఇస్తుంటే ఇతర పంటల వైపు ఎలా వెళ్లాలి ?

- రైతు అల్వాల వెంకటరెడ్డి



**పెద్దమందడి,ఆగస్టు11(తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వం వరి పంటకు మద్దతు ధరతో పాటు బోనస్ అందిస్తామని చెబుతూ రైతులను వరి సాగు వైపే ప్రోత్సహిస్తున్నప్పుడు, ఇతర పంటల వైపు ఎలా వెళ్లాలని రైతు వెంకటరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం వనపర్తి జిల్లా పెద్దమందడి రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొని రైతులతో మాట్లాడుతున్న సందర్భంగా.. రైతు వెంకట్ రెడ్డి తన అభిప్రాయాన్ని వెల్లడించారు.వరి పంటకు మద్దతు ధర, బోనస్ వంటి ప్రోత్సాహకాలు ఉన్నప్పుడు రైతులు సహజంగానే వరి సాగు వైపే మొగ్గుచూపుతారని వెంకటరెడ్డి అన్నారు. ఒకవైపు వరి సాగు చేయొద్దని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలు సాగు చేయాలని అధికారులు సూచిస్తుంటే.. మరోవైపు వరికి మద్దతు ధర, బోనస్ వంటి ప్రోత్సాహకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు ఎలా మళ్లుతారని ప్రశ్నించారు.ఆరుతడి పంటలను ప్రోత్సహించాలంటే వాటికి కూడా వరికి ఇస్తున్న విధంగా నాణ్యమైన విత్తనాలు, గిట్టుబాటు ధర, బోనస్ వంటి ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు. కేవలం రైతులను ఇతర పంటలు సాగు చేయాలని సూచించడం కాకుండా, ఆ పంటలకు మార్కెట్ భరోసా, ధరల పరంగా ప్రభుత్వ మద్దతు కల్పిస్తేనే రైతులు ఆరుతడి పంటల వైపు ఆసక్తి చూపుతారని అన్నారు.

బుధవారం - 12 - ఆగస్టు 2026


తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలి



- **వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి,ఆగస్టు11(తెలంగాణ ముచ్చట్లు):** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, సిబ్బందిని సద్వినియోగం చేసుకుని ప్రసవాల సంఖ్యను పెంచాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్య సిబ్బందిని ఆదేశించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు.మంగళవారం పెద్దమందడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సంబంధించిన వివిధ రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి గర్భిణికి తప్పనిసరిగా రక్తహీనత (అనీమియా) పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. హీమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్న గర్భిణులకు అవసరమైన మందులు, పోషకాహారంపై సూచనలు అందించి వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అనంతరం ప్రసవ గదిని (లేబర్ రూమ్) పరిశీలించిన కలెక్టర్ అక్కడ అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ప్రసవాలకు వచ్చే గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని, పరిశుభ్రతను పాటిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.వాతావరణ పరిస్థితుల దృష్ట్యా డెంగ్యూ, విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జ్వరం, జలుబు, ఒంటినొప్పులతో ఆసుపత్రికి వచ్చే రోగులకు తప్పనిసరిగా రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ పరిమళ, మెడికల్ ఆఫీసర్, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజల మధ్యలో ప్రణవ్ బాబు.. ఇంటింటికీ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు

- **జమ్మికుంట మండలంలోని 12 గ్రామాల్లో రూ.11 లక్షల చెక్కుల పంపిణీ**

**జమ్మికుంట రూరల్, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రతి గడపకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను చేరవేస్తామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. మంగళవారం జమ్మికుంట మండల పరిధిలోని మాచనపల్లి, పెద్దంపల్లి, జగ్గయ్యపల్లి, సైదాబాద్, కోరపల్లి, విలాసాగర్, నగురం, వావిలాల, తనుగుల, గండ్రపల్లి, శాయంపేట, మడిపల్లి గ్రామాల్లో ప్రణవ్ పర్యటించారు. ఈ సందర్భంగా 34 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.11 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వారి ఇళ్ల వద్దకే వెళ్లి స్వయంగా అందజేశారు.
లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరించిన ప్రణవ్ వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ కష్టకాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం, వొడితల ప్రణవ్ తమకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.
అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేయడం ద్వారా వారి కష్టాల్లో భాగస్వాములవుతున్నామని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జమ్మికుంట మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.హుజూరాబాద్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ప్రణవ్ స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరమనేని పరశురామ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మార్కెట్ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కత్తితో యువకుడి హల్‌చల్.. కాలనీవాసుల్లో భయాందోళన



**కుషాయిగూడ, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాప్రా శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీలో సోమవారం రాత్రి ఓ యువకుడు కత్తితో హల్‌చల్ సృష్టించాడు. కొబ్బరి బొండాలు కోసే కత్తిని చేతిలో పట్టుకుని కాలనీలో తిరుగుతూ హంగామా చేయడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.
యువకుడు కత్తితో కాలనీలో తిరుగుతున్న విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే కుషాయిగూడ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనతో కాలనీలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. యువకుడు కత్తితో ఎందుకు హల్‌చల్ చేశాడు? అతడి ప్రవర్తనకు కారణమేంటి? అనే విషయాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.
ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.





# సదుపాయాల విస్తరణతో జమ్మికుంటకు కొత్త ఊపు

- **వాణిజ్య విస్తరణతో పట్టణ అభివృద్ధికి దోహదం**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణ పరిధిలోని వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ మారుతి సుజుకి షోరూమ్‌లో నూతన బ్రీజా కారును మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.
అనంతరం ఆయన మాట్లాడుతూ జమ్మికుంట పట్టణానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నిత్యం వివిధ అవసరాల కోసం పట్టణానికి వచ్చి వెళ్తుంటారని అన్నారు. జిల్లా, పట్టణ స్థాయి సదుపాయాలకు దీటుగా నూతన వాహన షోరూమ్‌లు జమ్మికుంటలో అందుబాటులోకి రావడం పట్టణ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇలాంటి సంస్థల ఏర్పాటుతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పట్టణ ప్రజలకు, చుట్టుపక్కల గ్రామాల వారికి వాహనాల కొనుగోలు, సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. స్థానికంగానే అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండటం వల్ల ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని అన్నారు. జమ్మికుంటలో కొత్తగా ప్రారంభించిన వరుణ్ మోటార్స్‌లో అన్ని సదుపాయాలతో నూతన బ్రీజా కారు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. అవసరమైన వారు స్థానికంగానే వాహనాలను కొనుగోలు చేయడం ద్వారా పట్టణ వ్యాపారాభివృద్ధికి, ఉపాధి అవకాశాల పెంపునకు పరోక్షంగా దోహదపడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఫిరోజ్, కొలుగూరి సురేష్, మాచర్ల రాజు, యాట్ల అశోక్, ఎగిత అశోక్, షోరూమ్ మేనేజర్ అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# కౌశిక్ రెడ్డి పద్ధతి మార్చుకోకపోతే ప్రజాగ్రహం తప్పదు

- **డబుల్ బెడ్‌రూం ఇళ్లపై దొంగ డ్రామాలు ఆపాలి**
- **హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి అడ్డుపడే విధంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యవహరిస్తున్నారని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆరోపించారు. ప్రజా సమస్యలపై బాధ్యతగా వ్యవహరించాల్సిన ప్రజాప్రతినిధి ప్రభుత్వ కార్యక్రమాల్లో హుందాతనాన్ని పాటించాలని హితవు పలికారు. పద్ధతి మార్చుకోకపోతే ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రణవ్ మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో కౌశిక్ రెడ్డి చేస్తున్న విమర్శలు రాజకీయ డ్రామాలేనని ఆయన విమర్శించారు. ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్‌గా పనిచేసిన సమయంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఎందుకు పంపిణీ చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం గతంలో సగంలోనే నిలిచిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మంత్రులు, ఇన్‌చార్జి మంత్రుల సహకారంతో నిధులు మంజూరు చేయించి నిర్మాణాలను పూర్తి చేయిస్తున్నామని ప్రణవ్ తెలిపారు. ప్రస్తుతం ఇళ్ల గృహప్రవేశాలు జరుగుతున్న నేపథ్యంలో కౌశిక్ రెడ్డి ఓర్వలేక ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.అబద్ధాలను పదేపదే ప్రచారం చేస్తే అవి నిజాలుగా మారతాయనే భ్రమలో కౌశిక్ రెడ్డి ఉన్నారని ప్రణవ్ విమర్శించారు. సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం తప్ప ప్రజల సమస్యలు, సంక్షేమంపై ఆయనకు శ్రద్ధ లేదని ఆరోపించారు. మంత్రుల సమక్షంలో కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరు హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజల పరువును తీసే విధంగా ఉందని అన్నారు. ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్‌గా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా కౌశిక్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని ప్రణవ్ విమర్శించారు. హుజూరాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిత్యం మంత్రులు, అధికారులతో చర్చిస్తూ నిధులు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. జమ్మికుంట, హుజూరాబాద్, బుజునూర్ గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అవసరమైన నిధులు కేటాయించి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేస్తామని ప్రణవ్ వెల్లడించారు. వీటితో పాటు అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జమ్మికుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరశురాం, పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్, హుజూరాబాద్ మండల అధ్యక్షుడు కిరణ్, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ స్వప్నసదానందం, వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, డైరెక్టర్లు, మహిళా మండల అధ్యక్షురాలు స్వప్న, మహిళా నాయకురాళ్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గిన్నిస్ ప్రపంచ రికార్డు గ్రాండ్‌మాస్టర్‌కు ఘన సన్మానం

**జమ్మికుంట టూన్ ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు):** గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించిన జమ్మికుంటకు చెందిన సీనియర్ కరాటే గ్రాండ్‌మాస్టర్ డా. సుంకరి యాదయ్యను శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గిన్నిస్ ప్రపంచ రికార్డులో చాంపియన్ సర్టిఫికెట్‌తో పాటు బంగారు పతకం సాధించిన సందర్భంగా ఆయనకు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.
ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కరాటే పోటీల్లో 66 ఏళ్ల వయస్సులోనూ తన ప్రతిభను చాటుకున్న సుంకరి యాదయ్య గిన్నిస్ ప్రపంచ రికార్డు గుర్తింపును సాధించడం జమ్మికుంటకు గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. వయస్సు కేవలం సంఖ్య మాత్రమేనని నిరూపిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.
ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు డింగరి హరికృష్ణ ఆచార్యులు, కమిటీ ప్రతినిధులు కేదారీశ్వర్, ఏ. వెంకటేశ్వర్లు, రాజిరెడ్డి, తమ్మారావు, ప్రభాకర్ రావు, రమేష్, రామారావు, సంపత్ రావు తదితరులు డా. సుంకరి యాదయ్యను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



# ఎల్లమ్మ గుడిలో చోరీ.. 6 గ్రాముల పుస్తెలతాడు అపహరణ



**వేలేరు, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు-):**వేలేరు మండల కేంద్రంలోని శ్రీ ఎల్లమ్మ గుడిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గుడి చైర్మన్ గడ్డం వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం, గుడి తాళం పగలగొట్టి ఎల్లమ్మ తల్లి మేడలో ఉన్న 6 గ్రాముల పుస్తెల తాడును దుండగులు అపహరించారు.
ఈ ఘటనపై గౌడ సంఘ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వేలేరు ఎస్సై సురేష్ తెలిపారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# గణేష్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై పేదల ఆశలు.. వెంటనే పంపిణీ చేయాలి



- **అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించడంలో జాప్యం ఎందుకు? ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వన్నాల శివాజీ**

**హుజురాబాద్, ఆగస్టు 11(తెలంగాణ ముచ్చట్లు ):**హుజురాబాద్ పట్టణంలోని గణేష్ నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన నిరుపేదలకు వెంటనే పంపిణీ చేయాలని హుజురాబాద్ మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు వన్నాల శివాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఈ సందర్భంగా వన్నాల శివాజీ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదంతో బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేసిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు అందించాలనే లక్ష్యంతో నిర్మించారని తెలిపారు.
కమలాపూర్ మండల ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో ఆగస్టు పదిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ చేపట్టడం అభినందనీయమన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో ఇది కీలకమైన చర్య అని పేర్కొన్నారు.
అదేవిధంగా హుజురాబాద్ గణేష్‌నగర్‌లో నిర్మించి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా అర్హులైన పేదలకు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇళ్లు సిద్ధంగా ఉన్నప్పటికీ అర్హులకు ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు.
హుజురాబాద్ మండలంలోని 20 గ్రామాల ఉప సర్పంచ్‌ల తరఫున గణేష్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన నిరుపేదలకు వెంటనే పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని వన్నాల శివాజీ తెలిపారు. ప్రభుత్వం స్పందించి జాప్యం లేకుండా ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# గూడూరు స్వామి రెడ్డి తీరుపై హుజురాబాద్ జర్నలిస్టుల ఆగ్రహం

- **జర్నలిస్టుల ఇండ్ల స్థలాల వివాదంపై స్పందించకపోవడంపై నిరసన.**
- **రేపటి నుంచి దశలవారీ ఆందోళనలు**

**హుజురాబాద్, ఆగస్టు 11(తెలంగాణ ముచ్చట్లు):**హుజురాబాద్ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల వివాదంపై స్పందించడానికి నిరాకరించడంతో పాటు, స్వపక్ష ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామి రెడ్డి తీరును హుజురాబాద్ ప్రెస్ క్లబ్ తీవ్రంగా ఖండించింది. ఆయన వైఖరిని నిరసిస్తూ బుధవారం నుంచి దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, కార్యదర్శి కామని రవీందర్ ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల స్థలాలపై గూడూరు స్వామి రెడ్డి కోర్టులో కేసు వేసిన నేపథ్యంలో, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఆయన స్వగ్రామమైన ఇప్పల నర్సింగాపూర్‌లోని నివాసానికి వెళ్లి బొకే అందించి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అయితే కేసును ఉపసంహరించుకునేందుకు ఆయన నిరాకరించారని జర్నలిస్టులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా స్వామి రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఆరోపించారు. అధికారంలో ఉన్న సొంత ప్రభుత్వంపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని వారు విమర్శించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం హుజురాబాద్ నియోజకవర్గంలో స్వామి రెడ్డి కుటుంబానికి రాజకీయ పదవులు దక్కాయని జర్నలిస్టులు గుర్తు చేశారు. ఆయన సతీమణి గూడూరు రాజేశ్వరిని మార్కెట్ చైర్మన్‌గా నామినేట్ చేయించుకోవడంతో పాటు, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కోడలు గూడూరు మంజులను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేయడంలో స్థానిక కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ బాబు, మంత్రుల సహకారం తీసుకున్నారని వారు ఆరోపించారు.తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వ సహకారం పొందుతూ, జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో మాత్రం పట్టుదలగా వ్యవహరించడం సరికాదని ప్రెస్ క్లబ్ నాయకులు అన్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు బొకే ఇచ్చి విజ్ఞప్తి చేసేందుకు వెళ్లిన జర్నలిస్టు ప్రతినిధుల పట్ల స్వామి రెడ్డి వ్యవహరించిన తీరును వారు తీవ్రంగా ఖండించారు.
జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య పరిష్కారం అయ్యే వరకు దశలవారీగా ఆందోళనలు కొనసాగిస్తామని కాయిత రాములు, కామని రవీందర్ స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కోరం సుధాకర్ రెడ్డి, నంబీ భరణికుమార్, కేదాసి శ్రీధర్, టేకుల సాగర్, ఎడ్ల కుమార్, నిమ్మటూరి సాయికృష్ణ, పబ్బ తిరుపతి, మచ్చిక చందు, గోపగాని మహేష్, ఎన్‌టీవీ రాజు, పోతరాజు సంపత్, నాగవెల్లి రాజు, పయిమ్, భారత రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# సేవా కార్యక్రమాలతో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు.!

- **కార్మికులకు నిత్యావసర సరుకులు.**
- **ఆసుపత్రిలో అన్నదానం.. పండ్ల పంపిణీ.**



**సత్తుపల్లి, ఆగస్టు 11(తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలో మంగళవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ మున్సిపల్ కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం కార్మికులకు స్వయంగా భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అలాగే ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కమలమిత్ర అధినేత రహమత్ భాష ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు. సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదానం చేశారు. సత్తుపల్లి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టీపీఆర్‌పీఏ) సత్తుపల్లి డివిజన్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, బాలింతలు, డయాలసిస్ బాధితులకు రూ.5 వేల విలువైన పండ్లను పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ నారాయణ, డాక్టర్ ఖాసిం (ఎండీ), ఇతర వైద్యుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ నరసింహ, చైర్‌పర్సన్ రిహానా బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యువజన, ఎన్ఎస్‌యూఐ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు. టీపీఆర్‌పీఏ డివిజన్ కమిటీ సభ్యులు బాల నాగేశ్వరరావు, దుస్సా వెంకటేశ్వరరావు, జి. విశ్వనాథం, గోలి వరప్రసాద్‌రెడ్డి, చి. నాగేశ్వరరావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.






# భూ రీ-సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం..

- **హద్దులు.. విస్తీర్ణం.. యాజమాన్య వివరాలపై స్పష్టత.**
- **ప్రతి భూమికి డిజిటల్ భూధార్..**
- **బేతుపల్లి పరిధిలో 12 వేల ఎకరాల్లో సర్వే.**

**సత్తుపల్లి, ఆగస్టు 11(తెలంగాణ ముచ్చట్లు):** భూముల హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి భూ రికార్డులను పకడ్బందీగా రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న సర్వే పనులను ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి సర్వే జరుగుతున్న తీరును పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ రీసర్వే ద్వారా రైతుల భూములకు సంబంధించిన వివాదాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, రెవెన్యూ రికార్డుల్లోని లోపాలను పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. భూముల వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందుబాటులో ఉన్న రికార్డులతో సరిపోల్చి సమగ్ర వివరాలను నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. రీసర్వే పూర్తయిన అనంతరం ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుతో డిజిటల్ భూధార్ కార్డు అందుబాటులోకి రానుందని తెలిపారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలో సుమారు 12 వేల ఎకరాల భూముల్లో రీసర్వే ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ వెల్లడించారు. సర్వే పనులను వేగంగా పూర్తి చేసేందుకు 10 బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సుమారు 4 వేల ఎకరాల భూముల రీసర్వే పూర్తయిందని, మిగిలిన భూముల్లోనూ సర్వే ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. రీసర్వేలో భూముల వాస్తవ హద్దులు, విస్తీర్ణం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు రెవెన్యూ రికార్డుల్లో నమోదైన వివరాలను సమగ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గతంలో వివిధ కారణాలతో రికార్డుల్లో చోటుచేసుకున్న తప్పులు, భూముల విస్తీర్ణంలో తేడాలు, హద్దులకు సంబంధించిన సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుందని పేర్కొన్నారు. భూములకు సంబంధించిన వివరాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ రికార్డుల్లో నమోదు చేయడం ద్వారా భవిష్యత్తులో భూ లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతుందని చెప్పారు. కలెక్టర్ సర్వేను పరిశీలిస్తున్న సమయంలో బేతుపల్లి గ్రామానికి చెందిన రైతులు సర్పంచ్ దొడ్డా రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి భూ సర్వేకు సంబంధించిన సమస్యలను వివరించారు. సర్వే సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భూముల వివరాల నమోదుకు సంబంధించిన అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యలను పరిగణనలోకి తీసుకుని సర్వే ప్రక్రియను నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ దొడ్డ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని భూములను ఎంపిక చేసి భూ రీసర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. సర్వే జరుగుతున్న విధానాన్ని పరిశీలించేందుకు క్షేత్రస్థాయికి వచ్చిన కలెక్టర్ దివాకర్ టీఎస్‌ను రైతులతో కలిసి కలిశామని, సర్వేకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించామని చెప్పారు. భూముల హద్దులు, విస్తీర్ణం, రికార్డులకు సంబంధించిన అంశాలపై రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. భూ రీసర్వే అనంతరం ప్రతి భూమికి డిజిటల్ భూధార్ అందుబాటులోకి రావడంతో భూమికి సంబంధించిన వివరాలపై స్పష్టత ఏర్పడటంతో పాటు భవిష్యత్తులో వివాదాలకు అవకాశం తగ్గుతుందని అధికారులు తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించిన వివరాల్లో ఏవైనా వ్యత్యాసాలు లేదా అభ్యంతరాలు ఉంటే సర్వే సమయంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను, సంబంధిత రికార్డులను పరిశీలించి నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం సత్యనారాయణ, సర్వే డీఐ నాగభూషణం తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# మత్తుకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు

- **నషా ముక్త్ భారత్ కోసం విద్యార్థుల ర్యాలీ**
- **బి.కె. శ్రీవాణి పిలుపు**






**హుజురాబాద్,ఆగష్టు 11(తెలంగాణ ముచ్చట్లు ):**మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యార్థులు తమ జీవితాలను ఉన్నత లక్ష్యాల వైపు నడిపించుకోవాలని హుజురాబాద్ బ్రహ్మకుమారి సెంటర్ ఇంచార్జ్ బి.కె. శ్రీవాణి పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, విద్యార్థి దశలోనే వ్యసనాలకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యకరమైన, విజయవంతమైన జీవితాన్ని నిర్మించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

**నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ర్యాలీ**

బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం హుజురాబాద్ పట్టణంలోని కాకతీయ కళాశాల విద్యార్థులతో నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ యువతను వ్యసనాలకు దూరంగా ఉండాలని సందేశాన్ని చాటారు.

**వ్యసనాలకు బానిసైతే జీవితాలు నాశనం**

ఈ సందర్భంగా బి.కె. శ్రీవాణి మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలైతే వారి ఆరోగ్యం, చదువు, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా విద్యార్థులు సన్మార్గంలో పయనించాలని సూచించారు. కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**పది కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమం**

దేశవ్యాప్తంగా బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో పది కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమాన్ని చేపట్టినట్లు బి.కె. శ్రీవాణి తెలిపారు. ఆరోగ్యకరమైన జీవితం, సామరస్య కుటుంబం, ఉజ్వల భవిష్యత్తు, అభివృద్ధి చెందిన దేశం కోసం ప్రతి ఒక్కరూ వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేయాలని కోరారు. ఒక్కొక్కరి మార్పుతోనే సమాజంలో పెద్ద మార్పు సాధ్యమవుతుందని అన్నారు.

**యోగాతో ఆరోగ్యకరమైన జీవనం**

యువత శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగ జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల వైపు వెళ్లకుండా క్రీడలు, యోగా, ధ్యానం, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని అన్నారు. మాదకద్రవ్య రహిత సమాజం, మాదకద్రవ్య రహిత దేశ నిర్మాణం కోసం విద్యార్థులు ముందుండాలని పిలుపునిచ్చారు.

**విద్యార్థులతో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ**

ర్యాలీ అనంతరం విద్యార్థులతో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా వ్యసనాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం ద్వారా యువతలో మత్తు పదార్థాలపై అవగాహన పెంచడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానం పట్ల చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు గుంటి రాజయ్య, శివరాత్రి ఈశ్వరయ్య, జ్యోతి రాణి, కళాశాల అధ్యాపకులు వేణు, రాజేశ్వర్ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# స్వాతంత్ర దినోత్సవ వేడుకల వేళ కట్టుదిట్టమైన భద్రత

- దేశవ్యాప్తంగా హైఅలర్ట్ ప్రకటించిన భద్రతా సంస్థలు
- శ్రీనగర్‌లో ముమ్మర తనిఖీలు, ప్రత్యేక నిఘా
- కీలక ప్రాంతాల్లో మోహరించిన అదనపు బలగాలు
- ఉగ్ర ముప్పు నేపథ్యంలో అప్రమత్తమైన కేంద్ర యంత్రాంగం



**శ్రీనగర్, ఆగస్టు 11(తెలంగాణ ముచ్చట్లు):** దేశ 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సమీపిస్తున్న వేళ భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఉగ్రవాద ముప్పు హెచ్చరికల నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌తో పాటు దేశంలోని కీలక నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. ముఖ్యంగా శ్రీనగర్ నగరంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టి, ప్రతి కదలికపై నిఘా ఉంచుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కేంద్ర, రాష్ట్ర భద్రతా యంత్రాంగాలు సమన్వయంతో పని చేస్తున్నాయి. స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరిగే ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలను భద్రతా దళాలు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నాయి. జమ్మూకశ్మీర్ పోలీసుల ప్రత్యేక ఆపరేషన్స్ గ్రూప్, సీఆర్‌పీఎఫ్, సైన్యం సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాయి. నగరంలోని ప్రధాన కూడళ్లు, ప్రవేశ ద్వారాలు, సున్నిత ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు.

శ్రీనగర్‌లోని పలు ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది కాలినడక గస్తీలు నిర్వహిస్తూ ప్రజల్లో భరోసా కల్పిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఆధునిక పరికరాలు, సీసీ కెమెరాలు, డ్రోన్ల సహాయంతో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నగరంలోని కీలక భవనాల చుట్టూ అదనపు భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. సరిహద్దు ప్రాంతాల్లో కూడా అప్రమత్తతను మరింత పెంచారు. చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు భద్రతా బలగాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. రాత్రి వేళల్లో నిఘాను బలోపేతం చేయడంతో పాటు సాంకేతిక పరికరాల సహాయంతో ప్రతి కదలికను గమనిస్తున్నాయి. ఉగ్రవాదులు ఏ రూపంలోనైనా దాడులకు పాల్పడే అవకాశం ఉందన్న సమాచారంతో భద్రతా వ్యవస్థ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంది. స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దేశ గౌరవాన్ని ప్రతిబింబించే స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. భద్రతా బలగాల అప్రమత్తత, ప్రజల సహకారంతో దేశవ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరగనున్నాయని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# పీవోకేలో ఉద్రిక్తత.. బ్రిటిష్ పౌరుడి మృతి

- నిరసనలపై కాల్పులు.. మరో బ్రిటిష్ వ్యక్తి అరెస్టు
- రెండు నెలలుగా నిర్బంధంలో వకాస్ ఆరిఫ్
- పాకిస్థాన్ అధికారులతో బ్రిటన్ సంప్రదింపులు
- ప్రభావిత ప్రాంతాలకు వెళ్లొద్దని ప్రయాణ హెచ్చరిక

**డెస్క్, ఆగస్టు 11(తెలంగాణ ముచ్చట్లు):** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో కొనసాగుతున్న నిరసనలు అంతర్జాతీయ స్థాయిలో దుమారం రేపుతున్నాయి. ఆర్థిక, ఎన్నికల సంస్కరణల కోసం నిర్వహించిన ఆందోళనల నేపథ్యంలో పాకిస్థాన్ భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో ఓ బ్రిటిష్ పౌరుడు ప్రాణాలు కోల్పోగా, మరో బ్రిటిష్ జాతీయుడిని అరెస్టు చేసి రెండు నెలలుగా నిర్బంధంలో ఉంచిన ఘటన వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. ఈ పరిణామాలపై బ్రిటన్ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ పాకిస్థాన్ అధికారులతో సంప్రదింపులు ప్రారంభించింది. బ్రిటన్‌లోని పీటర్‌బరో నగరానికి చెందిన 50 ఏళ్ల మహ్మద్ అక్తర్ జూన్ 9న కోట్లి నగరంలో జరిగిన నిరసనల సమయంలో భద్రతా బలగాల కాల్పుల్లో మరణించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. నిరసనల్లో ఆయన ప్రత్యక్షంగా పాల్గొనలేదని, ఇంటి సమీపంలో జరిగిన ఘటనలో తూటా గుండె పక్కన తగలడంతో ప్రాణాలు కోల్పోయారని బంధువులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయడానికి కూడా కుటుంబ సభ్యులు భయపడుతున్నారని వారు పేర్కొన్నారు.

మరోవైపు, నాటింగ్‌హామ్‌కు చెందిన 38 ఏళ్ల వకాస్ ఆరిఫ్‌ను జూన్ 5న మిర్‌పూర్‌లో అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తన సోదరుడు నిరసనల్లో పాల్గొనకపోయినా ఇంట్లోకి చొరబడి అరెస్టు చేశారని, ఇప్పటివరకు కోర్టులో కూడా హాజరుపరచలేదని ఆయన సోదరి సుమేరా ఆరోపించారు. ఈ ఘటన మానవ హక్కుల ఉల్లంఘనలపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ రెండు ఘటనలపై బ్రిటన్ విదేశాంగ కార్యాలయం స్పందిస్తూ ఇస్లామాబాద్‌లోని అధికారులతో సంప్రదింపులు కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. మరణించిన వ్యక్తి ఘటనపై పూర్తి నివేదిక కోరడంతో పాటు, నిర్బంధంలో ఉన్న వకాస్ ఆరిఫ్ పరిస్థితిపై వివరాలు తెలుసుకుంటున్నట్లు తెలిపింది. పౌరుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసింది. పీవోకేలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో ఆగస్టు 7న బ్రిటన్ ప్రభుత్వం తన ప్రయాణ సూచనలను సవరించింది. నిరసనల ప్రభావం ఉన్న ప్రాంతాలకు వెళ్లవద్దని తమ పౌరులను హెచ్చరించింది. భద్రతా పరిస్థితులు క్షీణిస్తున్నాయని పేర్కొంటూ అత్యవసరమైతే తప్ప ఆ ప్రాంతాలకు ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. పీవోకేలో జరుగుతున్న పరిణామాలు ఇప్పుడు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఒకవైపు నిరసనకారులపై బలప్రయోగం, మరోవైపు విదేశీ పౌరుల మృతి, అరెస్టుల ఘటనలు పాకిస్థాన్‌పై ఒత్తిడిని పెంచుతున్నాయి. ఈ వ్యవహారంపై బ్రిటన్ చేపట్టే తదుపరి చర్యలు, పాకిస్థాన్ స్పందనపై ప్రపంచ దేశాల దృష్టి కేంద్రీకృతమైంది.







# సైబర్ కేటుగాడు సండ్ర!

- సండ్ర వెంకట వీరయ్యపై పిడమర్తి రవి సంచలన ఆరోపణలు

**సత్తుపల్లి,ఆగస్టు11(తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ కార్యకలాపాల వెనుక మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాత్ర ఉందని పిడమర్తి రవి ఆరోపించారు. సండ్ర వెంకట వీరయ్యపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి, నిజానిజాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు.సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి పిడమర్తి రవి మాట్లాడుతూ.. సండ్ర వెంకట వీరయ్య సైబర్ నేరాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి చెందిన చదువుకున్న యువకులను ఉపయోగించుకుని ఆస్ట్రేలియాలో ఒక సంస్థను ఏర్పాటు చేసి, దాని ద్వారా భారీగా అక్రమంగా డబ్బు సంపాదించారనే ఆరోపణలు ఉన్నాయని అన్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో మద్యం అక్రమ వ్యాపారం, నకిలీ నోట్ల తయారీ, జూదం, బెట్టింగ్ తదితర అక్రమ కార్యకలాపాల వెనుక సండ్ర వెంకట వీరయ్య ఉన్నారని పిడమర్తి రవి ఆరోపించారు. ఈ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిగితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి కంటే వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారంటూ సండ్ర వెంకట వీరయ్యపై విమర్శలు చేశారు. అక్రమ కార్యకలాపాలకు సంబంధించి పలువురిపై చర్యలు తీసుకునే ముందు వాటి వెనుక ఉన్న అసలు వ్యక్తులపై దృష్టి సారించాలని కోరారు. సండ్ర వెంకట వీరయ్యను, ఆస్ట్రేలియాలో ఉన్న ఆయన కుమారుడిని కూడా విచారించి అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, పోలీసులను పిడమర్తి రవి కోరారు. సమగ్ర దర్యాప్తు జరిగితే ఆరోపణలకు సంబంధించిన నిజానిజాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. ఇటీవల తనపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సండ్ర వెంకట వీరయ్య సత్తుపల్లి నియోజకవర్గానికి దూరంగా ఉంటూ అక్కడి పరిస్థితులపై సంభాషణలు జరుపుతున్నారని పిడమర్తి రవి ఆరోపించారు.



# ప్లాస్టిక్ రహిత జీవనం.. సాధ్యమేనా?

- సౌకర్యం పేరుతో పెరుగుతున్న ముప్పు
- ప్రకృతిని కబళిస్తున్న కృత్రిమ వ్యర్థాలు

**డెస్క్, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు):** మన దైనందిన జీవితంలో ప్లాస్టిక్ ఒక విడదీయరాని భాగంగా మారిపోయింది. ఉదయం పాలు తీసుకొచ్చే కవర్ నుంచి రాత్రి భోజనం తీసుకొచ్చే ప్యాకెట్ వరకు ప్రతి చోటా ప్లాస్టిక్ కనిపిస్తోంది. తక్కువ ఖర్చు, తేలికగా ఉండటం, సులభంగా అందుబాటులో ఉండటం వంటి కారణాలతో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగింది. అయితే ఇదే సౌకర్యం ఇప్పుడు ప్రకృతికి, మానవ ఆరోగ్యానికి, భవిష్యత్తు తరాలకు పెను ముప్పుగా మారుతోంది. ప్లాస్టిక్ వల్ల కలిగే ప్రమాదాల గురించి తెలిసినా దానిని తగ్గించే విషయంలో సమాజం ఇంకా ఆశించిన స్థాయిలో ముందుకు రావడం లేదు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటిలో గణనీయమైన భాగం సరైన విధంగా నిర్వహించబడక నదులు, చెరువులు, సముద్రాలు, అడవుల్లోకి చేరుతోంది. ఒకసారి ప్రకృతిలోకి చేరిన ప్లాస్టిక్ పూర్తిగా కరిగిపోవడానికి వందల సంవత్సరాలు పడుతుంది. ఫలితంగా నేల సారవంతత తగ్గిపోవడం, నీటి వనరులు కలుషితం కావడం, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం జరుగుతోంది. ప్రకృతిలో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు మానవాళి నిర్లక్ష్యానికి ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ప్లాస్టిక్ వల్ల ఎక్కువగా నష్టపోతున్నవి మూగజీవాలు. ఆహారంగా భావించి ప్లాస్టిక్ ముక్కలను తినే పశువులు, పక్షులు, సముద్ర జీవులు అనేకం ప్రాణాలు కోల్పోతున్నాయి. సముద్ర తీరాల్లో కొట్టుకొచ్చే తాబేళ్లు, చేపలు, పక్షుల కడుపుల్లో భారీ మొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడుతున్న ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. మానవుడు ఉపయోగించి విసిరేసిన ఒక చిన్న ప్లాస్టిక్ కవర్ కూడా ఒక జీవి మరణానికి కారణమవుతుందనే విషయాన్ని సమాజం గుర్తించాల్సిన అవసరం ఉంది. మానవ ఆరోగ్యంపై కూడా ప్లాస్టిక్ ప్రభావం ఆందోళన కలిగిస్తోంది. ప్లాస్టిక్ పదార్థాల్లో ఉండే కొన్ని రసాయనాలు ఆహారం, తాగునీటి ద్వారా శరీరంలోకి చేరుతున్నాయని పలు పరిశోధనలు సూచిస్తున్నాయి. సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు గాలి, నీరు, ఆహారం ద్వారా మన శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. దీర్ఘకాలంలో ఇవి ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉందని



నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంటే ప్లాస్టిక్ వల్ల ప్రకృతి మాత్రమే కాదు, మనిషి కూడా ప్రమాదంలో పడుతున్నాడన్న మాట. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ప్లాస్టిక్ వ్యర్థాల సమస్య విస్తరిస్తోంది. వర్షాకాలంలో డ్రైనేజీలు మూసుకుపోవడానికి, రోడ్లపై నీరు నిలిచిపోవడానికి ప్రధాన కారణాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా ఒకటి. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయడం, వాడేసి పారేసే సంస్కృతి పెరగడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువులపై ఆధారపడటం తగ్గించకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు ప్లాస్టిక్ నియంత్రణకు పలు చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రజల సహకారం లేకుండా ఆశించిన ఫలితాలు సాధ్యం కావు. కొన్ని రకాల ప్లాస్టిక్ వస్తువులపై నిషేధాలు అమలులో ఉన్నా, వినియోగం పూర్తిగా తగ్గలేదు. నియమాలు ఎంత కఠినంగా ఉన్నా ప్రజల్లో చైతన్యం లేకపోతే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. అందుకే చట్టాలతో పాటు సామాజిక బాధ్యత కూడా అవసరం. ప్లాస్టిక్ రహిత జీవనం అసాధ్యమేమీ కాదు. చిన్న చిన్న మార్పులతో పెద్ద ఫలితాలు సాధించవచ్చు. వస్త్ర సంచులు వినియోగించడం, ఉక్కు లేదా గాజు పాత్రలను ఉపయోగించడం, ఒకసారి వాడి పారేసే వస్తువులకు బదులుగా పునర్వినియోగ వస్తువులను ఎంచుకోవడం వంటి అలవాట్లు పెంచుకోవాలి. ప్రతి కుటుంబం రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని కొంతైనా తగ్గించగలిగితే సమాజంపై గణనీయమైన ప్రభావం కనిపిస్తుంది. పాఠశాలల నుంచి ఈ చైతన్యాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఉంది. చిన్నప్పటి నుంచే పిల్లలకు పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ ప్రమాదాల గురించి అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులు తయారవుతారు. విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థలు కలిసి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం ఒక వ్యక్తి పని కాదు, సమాజం మొత్తం చేపట్టాల్సిన ఉద్యమం.ప్రకృతిని కాపాడటం అంటే కేవలం చెట్లు నాటడం మాత్రమే కాదు, ప్రకృతిని నాశనం చేసే అలవాట్లను విడిచిపెట్టడం కూడా. నేడు మనం నిర్లక్ష్యంగా పడేస్తున్న ప్లాస్టిక్ రేపటి తరాలకు భారంగా మారబోతోంది. మన సౌకర్యం కోసం ప్రకృతిని తాకట్టు పెడితే దాని మూల్యం భవిష్యత్తులో భారీగా చెల్లించాల్సి వస్తుంది. పర్యావరణ సంక్షోభాలు, వాతావరణ మార్పులు, జీవ వైవిధ్య నష్టం ఇప్పటికే హెచ్చరిక గంటలు మోగిస్తున్నాయి. ప్లాస్టిక్ రహిత జీవనం పూర్తిగా సాధ్యమా అనే ప్రశ్నకు సమాధానం మన చేతుల్లోనే ఉంది. ఒక్కసారిగా పూర్తిగా ప్లాస్టిక్‌ను వదిలేయడం కష్టమైనా, దాని వినియోగాన్ని గణనీయంగా తగ్గించడం మాత్రం సాధ్యమే. ప్రతి వ్యక్తి, ప్రతి కుటుంబం, ప్రతి సంస్థ ఈ దిశగా ఒక అడుగు ముందుకు వేస్తే సమాజంలో పెద్ద మార్పు కనిపిస్తుంది. లేదంటే రాబోయే రోజుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన భూమిని, కలుషితమైన నీటిని, ప్రమాదంలో పడిన జీవ వ్యవస్థను చూసే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది కేవలం పర్యావరణ సమస్య కాదు.. మనుగడకు సంబంధించిన హెచ్చరిక అని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.



## ఉజ్జయిని మహంకాళికి మారు బోనం

- ఆషాడ బోనాల వేడుకల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు
- తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా మారు బోనం సమర్పణ
- బోనమెత్తిన మహిళలకు చీరె, సారె అందజేత
- ప్రజల సుఖసంతోషాల కోసం అమ్మవారిని ప్రార్థించిన మంత్రి

హైదరాబాద్, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు):

ఆషాడ బోనాల ఉత్సవాల్లో భాగంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మారు బోనం సమర్పించారు. భక్తిశ్రద్ధల నడుమ ఆలయానికి చేరుకున్న మంత్రికి దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. మంత్రి కొండా సురేఖ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో జరిగిన మారు బోనం కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి నైవేద్యంగా బోనం సమర్పించారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో మారు బోనం కార్యక్రమానికి విశిష్ట స్థానం ఉందని మంత్రి పేర్కొన్నారు. అమ్మవారికి సమర్పించిన బియ్యంతో తిరిగి మారు బోనం చేయడం భక్తి, సంప్రదాయాల సమ్మేళనంగా నిలుస్తుందని తెలిపారు. ఈ ఆచారం తెలంగాణ ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో భాగంగా బోనమెత్తిన మహిళలను మంత్రి సత్కరించారు. వారికి చీరె, సారె అందజేసి ఆశీర్వదించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించడంతో ఆలయ పరిసరాలు భక్తజన సందోహంతో నిండిపోయాయి.

ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి కొండా సురేఖ, ఉజ్జయిని మహంకాళి అమ్మవారి మారు బోనం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి కృపతో తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతి, సుభిక్షాలు నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది ఆషాడ బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ ఏర్పాట్లకు ప్రజల సహకారం తోడవడంతో బోనాల సంబరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించే ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని మంత్రి అన్నారు.



## హైదరాబాద్‌లో సెంట్రికా గ్లోబల్ వ్యాల్యూ సెంటర్ ప్రారంభం

- ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు
- తెలంగాణపై ప్రపంచ సంస్థల విశ్వాసానికి నిదర్శనం
- ఉపాధి అవకాశాలకు కొత్త ఊతం
- సాంకేతికత, ఆవిష్కరణలకు హైదరాబాద్ కేంద్రం

హైదరాబాద్, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు):

హైదరాబాద్‌లో సెంట్రికా, క్లాడ్ యాంగిల్స్ సంస్థలు ఏర్పాటు చేసిన కొత్త గ్లోబల్ వ్యాల్యూ సెంటర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థల ప్రతినిధులతో కలిసి కేంద్రాన్ని సందర్శించిన మంత్రి, తెలంగాణలో అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులు పెరుగుతుండటం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. కొత్త గ్లోబల్ వ్యాల్యూ సెంటర్ ప్రారంభం హైదరాబాద్ అభివృద్ధిలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి అన్నారు. ప్రతిభ, సాంకేతికత, ఆవిష్కరణలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఈ కేంద్రం ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రపంచ స్థాయి సంస్థలు తెలంగాణను విశ్వసించి తమ కార్యకలాపాలను విస్తరించడం రాష్ట్రానికి ఉన్న అనుకూల వ్యాపార వాతావరణాన్ని ప్రతిబింబిస్తోందన్నారు.

సాంకేతిక రంగంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రపంచ సంస్థలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, విధానపరమైన ప్రోత్సాహకాలు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. ఈ కారణంగానే అనేక అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌ను తమ విస్తరణ కేంద్రంగా ఎంచుకుంటున్నాయని వివరించారు. ఈ గ్లోబల్ వ్యాల్యూ సెంటర్ ద్వారా రాష్ట్ర యువతకు నాణ్యమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. సమాచార సాంకేతిక రంగంలో కొత్త ఉద్యోగాలు సృష్టించడంతో పాటు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ, అనుభవం పొందే అవకాశాలు కూడా యువతకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. హైదరాబాద్ ఇప్పటికే ప్రపంచ ఐటీ మ్యాప్‌పై ప్రత్యేక గుర్తింపు సాధించిందని, ఇప్పుడు గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మరింత బలపడుతోందని మంత్రి పేర్కొన్నారు. సెంట్రికా, క్లాడ్ యాంగిల్స్ వంటి సంస్థల పెట్టుబడులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, సాంకేతిక రంగ విస్తరణకు దోహదపడతాయని చెప్పారు. సెంట్రికా, క్లాడ్ యాంగిల్స్ సంస్థల యాజమాన్యానికి మంత్రి అభినందనలు తెలిపారు. ఈ కేంద్రం విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ పెట్టుబడిదారులకు పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని ప్రపంచ సంస్థలకు అత్యంత ప్రాధాన్య గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సన్నాహాలు వేగవంతం

- అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం ఆదేశం
- పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన లక్ష్యం
- గత సమ్మిట్ ఫలితాలపై సమగ్ర నివేదిక కోరిన ముఖ్యమంత్రి

హైదరాబాద్, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు):



రాష్ట్రానికి మరిన్ని దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో డిసెంబర్‌లో నిర్వహించనున్న "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్" ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించి తెలంగాణను పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా ప్రపంచానికి చాటిచెప్పేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల సేకరణలో రాష్ట్రం మరింత ముందంజలో నిలిచేలా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని సూచించారు. సమ్మిట్ ద్వారా కొత్త పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సమ్మిట్ ఏర్పాట్లు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపార రంగ ప్రముఖులను ఆకర్షించే విధంగా కార్యక్రమ రూపకల్పన చేయాలని చెప్పారు. తెలంగాణలో ఉన్న పరిశ్రమల అనుకూల వాతావరణం, మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను సమ్మిట్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించాలని సూచించారు. పెట్టుబడిదారులకు రాష్ట్ర సామర్థ్యాలను సమగ్రంగా వివరించేలా ప్రత్యేక ప్రదర్శనలు, చర్చా వేదికలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

వ్యాపార రంగంలోని వివిధ విభాగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను సమ్మిట్ వేదికగా సన్మానించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామిక రంగంలో విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు గుర్తింపు ఇవ్వడం ద్వారా తెలంగాణ పెట్టుబడి వాతావరణంపై సానుకూల సందేశం వెళ్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి దోహదపడుతున్న రంగాలను ప్రోత్సహించేందుకు సమ్మిట్‌ను సమర్థవంతమైన వేదికగా ఉపయోగించుకోవాలని చెప్పారు. ప్రపంచ స్థాయి సంస్థల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ఏడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి అమలు పురోగతి, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై పూర్తి వివరాలను సమర్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కుదిరిన ఒప్పందాలు ఎంత మేరకు అమలయ్యాయి, ఎన్ని పరిశ్రమలు కార్యకలాపాలు ప్రారంభించాయి, ఎన్ని ఉద్యోగాలు సృష్టించబడ్డాయి అనే అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని చెప్పారు. పెట్టుబడుల వాస్తవ పురోగతిని విశ్లేషించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు ప్రజలకు ఎంత మేర ప్రయోజనం చేకూర్చాయో కూడా అధ్యయనం చేయాలని పేర్కొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడుల వృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన కొత్త వ్యూహాలను రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, సాంకేతిక రంగాలు, తయారీ రంగం, సేవల రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, పెట్టుబడి ధోరణులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణకు అనుకూలమైన రంగాలను గుర్తించాలని చెప్పారు. పెట్టుబడిదారులకు అనుమతుల మంజూరు, భూముల కేటాయింపు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో వేగవంతమైన సేవలు అందించే విధానాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. డిసెంబర్‌లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలక వేదికగా నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఈ సమ్మిట్ మరింత బలం చేకూర్చనుందని అధికారులు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి కల్పన, పారిశ్రామిక విస్తరణ లక్ష్యాల సాధనలో ఈ సమ్మిట్ కీలక మలుపుగా మారనుందని భావిస్తున్నారు.

## ఆగస్టు 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

- సంగారెడ్డిలో రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి సీఎం శ్రీకారం
- 3.43 కోట్ల మంది లబ్ధిదారులకు ఆహార భద్రత రక్షణ
- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఉత్తమ్ ఆదేశాలు





హైదరాబాద్, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రవ్యాప్తంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఆహార భద్రత వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక కార్యక్రమంగా దీనిని అభివర్ణించిన మంత్రి, ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం అనంతరం రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ఒకేసారి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారుల పండుగగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. మంగళవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రోహిత్ సింగ్‌తో పాటు ఇతర అధికారులతో సమావేశమై కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కూడా ప్రత్యేకంగా మాట్లాడి ఏర్పాట్ల పురోగతిని తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

తెలంగాణలో ప్రస్తుతం సుమారు 1.06 కోట్ల ఆహార భద్రత కార్డులు ఉండగా, వాటి ద్వారా 3.43 కోట్ల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. 2025 జనవరి 26 నుంచి ఇప్పటివరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులు జారీ చేయగా, వాటి ద్వారా 61,08,544 మంది కొత్త లబ్ధిదారులు ఆహార భద్రత పరిధిలోకి వచ్చారని వెల్లడించారు. స్మార్ట్ రేషన్ కార్డుల ప్రవేశంతో ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, సౌలభ్యం మరింత పెరుగుతుందని తెలిపారు. సంగారెడ్డిలో జరిగే ప్రధాన కార్యక్రమాన్ని భారీ బహిరంగ సభగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. లబ్ధిదారుల రాకపోకలు, కూర్చునే ఏర్పాట్లు, భద్రతా చర్యలు, కార్డుల పంపిణీ విధానం, ముఖ్యమంత్రి కార్యక్రమాల షెడ్యూల్ వంటి అన్ని అంశాలపై నిమిషానికో ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.35 గంటల మధ్య కార్యక్రమం పూర్తి కావాలని, అనంతరం ముఖ్యమంత్రి తదుపరి అధికారిక కార్యక్రమాలకు హాజరయ్యేలా సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులకు పూర్తి వివరాలతో అధికారిక ఆహ్వానాలు పంపాలని చెప్పారు.

స్మార్ట్ రేషన్ కార్డులను ముఖ్యమంత్రి అందజేసే లబ్ధిదారులను అన్ని వర్గాల నుంచి ఎంపిక చేయాలని మంత్రి సూచించారు. నిర్దేశిత నమూనాలో లామినేషన్ చేసిన కార్డులను సిద్ధం చేసి పంపిణీ చేయాలని చెప్పారు. అనంతరం రేషన్ దుకాణాలు లేదా ఈ ప్రక్రియకు అనుబంధంగా ఉన్న గుర్తింపు పొందిన సంస్థల ద్వారా కార్డుల పంపిణీ చేపట్టాలని సూచించారు. లబ్ధిదారుల గుర్తింపును ధ్రువీకరించిన తర్వాతే కార్డులు అందజేయాలని, తద్వారా పారదర్శకత పెరగడంతో పాటు వివాదాలకు అవకాశం లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. మిగతా జిల్లాల్లో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అమలవుతున్న ఆహార భద్రత కార్యక్రమాల పరిమాణం ఎంతో విస్తృతమైందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రేషన్ బియ్యం కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, వరి కొనుగోళ్ల కోసం మరో రూ.20 వేల కోట్లు వ్యయం చేస్తోందని తెలిపారు. ఈ భారీ సంక్షేమ కార్యక్రమం గురించి ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. ముద్రిత, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించడంతో పాటు చిన్న వీడియోలు, డిజిటల్ ప్రచార సామగ్రి ద్వారా స్మార్ట్ రేషన్ కార్డుల ప్రయోజనాలు, ఉచిత సన్నబియ్యం పంపిణీ, లబ్ధిదారుల సంఖ్య వంటి వివరాలను ప్రజలకు చేరవేయాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి కార్యక్రమాన్ని క్రమబద్ధంగా, లబ్ధిదారులకు అనుకూలంగా, గౌరవప్రదంగా నిర్వహించాలని మంత్రి స్పష్టం చేశారు.

## క్యామ మల్లేష్‌ను పరామర్శించిన కేటీఆర్

- అస్వస్థత నుంచి కోలుకుంటున్న బీఆర్ఎస్ నేత
- త్వరగా పూర్తి ఆరోగ్యంతో రావాలని ఆకాంక్ష
- పలువురు నేతలతో కలిసి నివాసానికి వెళ్లిన కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు):

ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురై చికిత్స అనంతరం కోలుకుని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ నాయకుడు క్యామ మల్లేష్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వైద్యుల సూచనలు పాటిస్తూ పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేటీఆర్ క్యామ మల్లేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం మెరుగుపడుతోందని తెలిసి సంతోషం వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రజా జీవితంలో చురుకుగా కొనసాగుతున్న మల్లేష్ త్వరలోనే పూర్తిస్థాయిలో కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు రావాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ప్రజా సేవలో ఆయన పాత్ర కొనసాగాలని అభిలషించారు. పార్టీ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న నాయకులు ఆరోగ్యాన్ని కూడా సమానంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కేటీఆర్ పేర్కొన్నట్లు సమాచారం. పార్టీ శ్రేణులు కూడా ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాయని తెలిపారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, గొంగిడి సునీత, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. నాయకులంతా క్యామ మల్లేష్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పారు. త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో ప్రజా జీవితంలో మరింత చురుకుగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# భయమే ఆయుధంగా మారిన కొత్త సైబర్ నేరం

- **డిజిటల్ అరెస్టు పేరుతో కోట్ల దోపిడీ**

సైబర్ నేరాల ప్రపంచం రోజురోజుకూ కొత్త రూపాలు సంతరించుకుంటోంది. ఒకప్పుడు మోసగాళ్లు ఆశ చూపించి డబ్బు కొట్టేస్తే, ఇప్పుడు భయపెట్టి డబ్బు దోచుకోవడం కొత్త పద్ధతిగా మారింది. 'డిజిటల్ అరెస్టు' పేరుతో సాగుతున్న ఈ మోసం ప్రజల మానసిక బలహీనతలను లక్ష్యంగా చేసుకుంటోంది. ముఖ్యంగా వృద్ధులు, ఒంటరిగా నివసించే వారు ఈ ముఠాలకు ప్రధాన బాధితులుగా మారుతున్నారు.

మోసగాళ్లు పోలీసు, సీబీఐ, ఈడీ, కస్టమ్స్ లేదా ఇతర ప్రభుత్వ సంస్థల అధికారులుగా పరిచయం చేసుకుంటారు. మీ ఆధార్, మొబైల్ నంబర్ లేదా బ్యాంకు ఖాతా నేర కార్యకలాపాల్లో ఉపయోగించబడిందని చెబుతారు. వెంటనే అరెస్టు చేస్తామని బెదిరిస్తారు. తరువాత వీడియో కాల్‌లోకి తీసుకుని గంటల తరబడి లేదా రోజుల తరబడి తమ పర్యవేక్షణలో ఉంచుతారు. కుటుంబ సభ్యులతో మాట్లాడవద్దని, ఫోన్ పెట్టవద్దని ఆదేశించి బాధితుడిని మానసికంగా ఒంటరిని చేస్తారు. చివరకు 'దర్యాప్తు కోసం' లేదా 'ఖాతాను ధృవీకరించేందుకు' డబ్బు బదిలీ చేయిస్తారు.

ఇది ఎంత భయంకరమైన స్థాయికి చేరిందో ఇటీవలి ఘటనలు చెబుతున్నాయి. పుణేలో 87 ఏళ్ల రిటైర్డ్ అధికారి సీబీఐ అధికారులమని చెప్పిన మోసగాళ్ల చేతిలో రూ.3.46 కోట్లు కోల్పోయారు. అరెస్టు, మనీ లాండరింగ్ కేసు అంటూ దాదాపు ఏడు వారాలపాటు భయపెట్టి 15 విడతల్లో డబ్బు బదిలీ చేయించినట్లు పోలీసులు తెలిపారు.

గుజరాత్‌లో మరో వృద్ధుడు 18 రోజులపాటు 'డిజిటల్ అరెస్టు'లో ఉన్నట్లు నమ్మించి రూ.1.47 కోట్లు దోచుకున్నారు. నకిలీ ప్రభుత్వ పత్రాలు, నిరంతర వీడియో కాల్స్, తీవ్రమైన మానసిక ఒత్తిడితో అతడిని వలలోకి లాగారు.

ఇక కర్ణాటకలో ఒక మహిళను సుదీర్ఘకాలం భయపెట్టి కోట్ల రూపాయలు బదిలీ చేయించిన ఘటనలు వెలుగు చూశాయి. ఇలాంటి నేరాల్లో మోసగాళ్ల ప్రధాన ఆయుధం సాంకేతిక పరిజ్ఞానం కంటే మానసిక ఒత్తిడి, భయం, అధికార ప్రతిష్ఠను అనుకరించడం అని సైబర్ నేర పరిశోధకులు చెబుతున్నారు.

ఇటీవల సీబీఐ దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో 80కిపైగా ప్రాంతాల్లో దాడులు నిర్వహించి డిజిటల్ అరెస్టు మోసాలకు సంబంధించిన ముఠాలపై చర్యలు తీసుకుంది. ఒక నకిలీ వెబ్‌సైట్‌ను సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లా రూపొందించి ప్రజలను మోసం చేసిన వ్యవస్థ కూడా బయటపడింది.

ప్రజలు ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తుంచుకోవాలి. దేశంలో 'డిజిటల్ అరెస్టు' అనే చట్టపరమైన విధానం లేదు. ఏ పోలీసు లేదా దర్యాప్తు సంస్థ ఫోన్ లేదా వీడియో కాల్ ద్వారా అరెస్టు చేసి, ఖాతాలోని డబ్బును మరో ఖాతాకు బదిలీ చేయమని ఆదేశించదు. అలాంటి కాల్ వస్తే భయపడకుండా వెంటనే సంభాషణను నిలిపివేసి, కుటుంబ సభ్యులకు తెలియజేసి, సంబంధిత అధికారులను సంప్రదించాలి. సైబర్ నేరాల్లో ఇప్పుడు డబ్బుపై ఆశ కాదు... మనిషి మనసులోని భయమే అసలు లక్ష్యం. అందుకే అప్రమత్తతే తొలి రక్షణ.

హెచ్. ప్రతాప్

# హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయండి

- **ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు**
- **ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరవేయాలి**
- **వందేమాతరం 150 ఏళ్లకు అంకితం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 11 (తెలంగాణ ముచ్చట్లు):**





స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి భారతీయుడు చురుకుగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని కోరారు. ''హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా'' అనే సందేశంతో దేశ ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ప్రత్యేక రీల్‌ను పంచుకున్న ప్రధాని మోదీ, స్వాతంత్ర్య దినోత్సవాన్ని గర్వంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని సూచించారు. దేశ అభివృద్ధి లక్ష్యమైన 'వికసిత్ భారత్' సాధనకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని, ఈ సందర్భంగా దేశాభివృద్ధికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిలో త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా చూడాలని, ఈ కార్యక్రమాన్ని జాతీయ వేడుకగా మార్చాలని కోరారు.

ఇటీవల సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా కూడా ప్రధాని మోదీ ప్రజలను ఉద్దేశించి సందేశం ఇచ్చారు. త్రివర్ణ పతాకం కేవలం జెండా మాత్రమే కాదని, అది దేశ గౌరవానికి, ఐక్యతకు, సార్వభౌమాధికారానికి ప్రతీక అని పేర్కొన్నారు. దేశం కోసం అత్యుత్తమంగా సేవ చేయాలనే స్ఫూర్తిని జాతీయ పతాకం ప్రతి భారతీయుడిలో నింపుతుందని తెలిపారు. దేశభక్తి భావనను మరింత బలపరచడంలో 'హర్ ఘర్ తిరంగా' కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ ఏడాది నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' గీతం 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని వెల్లడించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో 'వందేమాతరం'కు ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తూ, ఆ స్ఫూర్తిని నేటి తరాలకు చేరవేయాలని సూచించారు. త్రివర్ణ పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమ, దేశభక్తి విలువలను ప్రజల్లో మరింతగా పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు.

'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమానికి దేశవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంటోంది. గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నాయి. జాతీయ పతాకంతో ప్రతి కుటుంబానికి మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా దేశభక్తి వాతావరణం నెలకొల్పడం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకోవడం, జాతీయ ఐక్యతను మరింత బలోపేతం చేయడం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొంటున్నారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేసి దేశ గౌరవాన్ని చాటాలని ప్రధాని మోదీ మరోసారి దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.



# నాలుగో రోజూ జోరుగా వసూళ్లు!

వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్ సొంతం చేసుకున్న ఈ సినిమా మొదటి వీకెండ్‌లోనే సుమారు రూ.37 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి మంచి విజయాన్ని అందుకుంది. వీకెండ్ ముగిసిన తర్వాత వచ్చిన తొలి వర్కింగ్ డే అయిన సోమవారం కూడా సినిమా జోరు ఏమాత్రం తగ్గలేదు. కఠినమైన 'మండే టెస్ట్'ను ఈ చిత్రం విజయవంతంగా పాస్ అయింది.

విడుదలైన నాలుగో రోజైన సోమవారం ఒక్కరోజే బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా 70 వేలకు పైగా టికెట్లు అమ్ముడవడం విశేషంగా మారింది. దీనిని బట్టి తొలి వర్కింగ్ డేలోనూ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇదే జోరు కొనసాగితే రాబోయే రోజుల్లోనూ 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద మరింత మెరుగైన వసూళ్లు సాధించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

విభిన్నమైన కథాంశంతో పాటు హారర్, కామెడీ అంశాలను మేళవించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా వరుణ్ తేజ్ నటన, సత్య కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. రాయలసీమ నేపథ్యానికి కొరియన్ కల్చర్‌ను జోడిస్తూ దర్శకుడు మేర్లపాక గాంధీ రూపొందించిన కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తోంది.

ఇదిలా ఉంటే.. సినిమా ఘన విజయం సాధించిన సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ను గ్రాండ్‌గా నిర్వహిస్తోంది. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. వరుణ్ తేజ్‌కు చాలా కాలం తర్వాత మంచి విజయం దక్కడంతో ఈ సక్సెస్ సెలబ్రేషన్‌పై మెగా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటించారు. ఎస్.ఎస్. థమన్ సంగీతం అందించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.

మొదటి వీకెండ్‌లో భారీ వసూళ్లు, సోమవారం కూడా కొనసాగిన టికెట్ బుకింగ్స్‌తో 'కొరియన్ కనకరాజు' సక్సెస్‌ఫుల్ రన్ కొనసాగిస్తోంది.



# హీరోయిన్‌గా కలిసిరాని అదృష్టం.. పెళ్లి తర్వాత కూడా తగ్గని అందం

అందం, అభినయం ఉన్నప్పటికీ కొంతమంది హీరోయిన్లకు సినీ కెరీర్ ఆశించిన స్థాయిలో కలిసిరాదు. వరుసగా సినిమాలు చేసినా సరైన విజయాలు దక్కకపోవడంతో కొంతకాలానికే సినిమాలకు దూరమవుతుంటారు. అలాంటి హీరోయిన్లలో ప్రణీత సుభాష్ కూడా ఒకరు.

కన్నడ సినిమాలతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రణీత సుభాష్ తన క్యూట్ లుక్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 'ఏం పిల్లో ఏం పిల్లడో' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఆమె ఆ తర్వాత వరుసగా సినిమాల్లో నటించారు. హీరోయిన్‌గా మాత్రమే కాకుండా సెకండ్ హీరోయిన్‌గానూ పలు చిత్రాల్లో కనిపించారు.

పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన 'అత్తారింటికి దారేది' సినిమాతో ప్రణీత సుభాష్‌కు భారీ విజయం దక్కింది. ఈ సినిమాలో ఆమె పాత్రకు మంచి స్పందన వచ్చింది. ఆ తర్వాత 'పాండవులు పాండవులు తుమ్మెద', 'రభస', 'డైనమైట్', 'బ్రహ్మోత్సవం', 'హలో గురు ప్రేమకోసమే' వంటి సినిమాల్లో నటించారు.

అయితే వరుస అవకాశాలు వచ్చినప్పటికీ ప్రణీత సుభాష్‌కు హీరోయిన్‌గా ఆశించిన స్థాయిలో స్టార్‌డమ్ మాత్రం దక్కలేదు. కెరీర్ మంచి దశలో ఉండగానే ఆమె వివాహం చేసుకుని సినిమాలకు దూరమయ్యారు. ప్రస్తుతం కుటుంబ జీవితంలో బిజీగా ఉన్న ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ ప్రణీత సుభాష్ సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటున్నారు. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఫొటోలు, కుటుంబ సభ్యులతో కలిసి దిగిన ఫొటోలు, ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ పోస్టులను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. ఆమె తాజా ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో అభిమానులు మరోసారి ఆమె గురించి ఆసక్తిగా సెర్చ్ చేస్తున్నారు.

తెలుగు సినిమాల్లో తక్కువ సంఖ్యలోనే చిత్రాలు చేసినప్పటికీ 'అత్తారింటికి దారేది' వంటి విజయవంతమైన చిత్రంతో ప్రణీత సుభాష్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉన్నా సోషల్ మీడియా ద్వారా అభిమానులకు దగ్గరగా ఉంటూ తన క్రేజ్‌ను కొనసాగిస్తున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in